

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

# తిరుగులేని 'గిరి'బిడ్డ

## రాజకీయంగా అంచెలంచెలుగా ఎదిగిన కోవ లక్ష్మి

- 1995లో ఎంపీటీసీగా ప్రస్థానం ప్రారంభం
- ఎంపీపీ, సర్పంచ్, ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్‌గా సేవలు
- ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో మరోసారి భారీ మెజార్టీతో గెలుపు
- 28 ఏళ్లుగా ప్రజా సేవకు అంకితం
- మాజీ మంత్రి కొట్నాక్‌భీంరావు వారసత్వాన్ని నిలబెడుతూ ముందుకు..

ఆసిఫాబాద్, డిసెంబర్ 4 : మాజీ మంత్రి కొట్నాక్ భీంరావు కుమార్తెగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన కోవ లక్ష్మి అంచెలంచెలుగా ఎదిగింది. ఎంపీటీసీ స్థాయి నుంచి ఎమ్మెల్యేగా ఎదిగి తన తండ్రి వారసత్వాన్ని నిలబెట్టింది. మహిళలు రాజకీయాల్లో రాణించాలంటే చాలా కష్టం. కుటుంబాన్ని చూసుకుంటూనే రాజకీయాల్లో తనదైన శైలిలో ముందుకు సాగింది. కోవ లక్ష్మి 1995లో తన భర్త కోవ సోనేరావు ప్రోత్సాహంతో రాజకీయ రంగ ప్రవేశం చేసి విజయవంతంగా ముందుకు సాగింది.

### రాజకీయ ప్రస్థానం..

1995లో తిర్యాణి మండలం పండిగి మాదర ఎంపీటీసీ స్థానానికి మొదటిసారి నిలబడి గెలిచింది. 2001లో పండిగి మాదర నుంచి మరోసారి ఎంపీటీసీగా గెలిపొందింది. 2002లో తిర్యాణి మండల ఎంపీపీగా సేవలు అందించారు. అనంతరం ఆసిఫాబాద్ పట్టణ సర్పంచ్‌గా 2006లో గెలుపొందారు. మరోసారి 2013లోనూ ఆసిఫాబాద్ సర్పంచ్‌గా గెలిపొందారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో 2014లో మొదటిసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఏడాది పాటు తెలంగాణ ప్రభుత్వ పార్లమెంటరీ కార్యదర్శి (రాష్ట్ర వ్యవసాయ సహాయ మంత్రిగా) పని చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 171 ఓట్లతో ఓటమిని చవి చూశారు. 23 యేండ్లపాటు ఓటమి లేకుండా ఏ ఎన్నికలు వచ్చినా విజయమే ఆమె సొంతం అయ్యింది. మొదటి సారి ఓటమి కావడంతో నిరాశలో ఉండగా, కేసీఆర్ స్వయంగా జడ్పీ చైర్‌పర్సన్‌గా ప్రకటించారు. 2019 జూన్‌లో జరిగిన ఎన్నికల్లో జడ్పీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం కుమ్రంభీం జిల్లాకు జడ్పీ చైర్‌పర్సన్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న క్రమంలో ముడో సారి ఎమ్మెల్యే అభ్యర్థిగా బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి 22,810 ఓట్ల మెజార్టీతో విజయం సాధించింది. కాంగ్రెస్ అభ్యర్థి శ్యాంనాయక్‌పై గెలుపొందింది.

### కపటంలేని 'కోవ'..

ఎలాంటి కపటం లేకుండా ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసే మృదుస్వభావి కోవ లక్ష్మి. ప్రజాప్రతినిధిగా తన పరిధిలోని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ఎంతో కృషి చేస్తూ వచ్చారు. తాను చేసిన అభివృద్ధి, ప్రజలతో మమేకం అయ్యి ముందుకుసాగడమే ఆమెకు కలసి వచ్చింది. తిర్యాణి మండలంలోని మొదలైన రాజకీయ ప్రస్థానం ఎమ్మెల్యే స్థాయికి ఎదిగేలా చేసింది. తన తండ్రి కొట్నాక భీంరావు స్ఫూర్తితో ప్రజా సేవకు తన జీవితం అంకితం చేసినట్లుగా కోవలక్ష్మి చెబుతుంది.

### నిక్కచ్చైన మనిషి..

రాజకీయాల్లో రాణించాలంటే ఎన్నో ఒడిదుడుకులు ఉంటాయి. అందుల్లో రాజకీయంగా ఎదుర్కోవడం అనేది చిన్న విషయం కాదు. కానీ కోవలక్ష్మి తను నమ్మిన సిద్ధాంతం ఒక్కటే.. తన తప్పును ఒప్పుకోవడంలో వెనుకడుగు వేయదు. నిక్కచ్చిగా మాట్లాడడం ఆమెకు కలసి వచ్చింది. రాజకీయంలో ఎదిగేందుకు ఎలాంటి కుట్రలు.. కుతంత్రలు చేయడం ఆమెకు ఏమాత్రం ఇష్టం ఉండదు. ఆమె మంచితనాన్ని కొంత మంది ఆసరాగా చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి.

# బీఆర్ఎస్‌కే జై..

## ఆసిఫాబాద్‌లో గులాబీ పార్టీవైపే ప్రజల మొగ్గు

- రెండో స్థానంలో కాంగ్రెస్
- స్వతంత్ర అభ్యర్థి విజయ్‌కి మూడో స్థానం
- బీజేపీకి ఏడు వేల లోపే ఓట్లు..
- కోవ లక్ష్మిని ఓడించాలనుకున్న కాంగ్రెస్ కుట్రను తిప్పికొట్టిన ఓటర్లు




ఆసిఫాబాద్, డిసెంబర్ 4 : ఆసిఫాబాద్ నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్‌కే జై కొట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీచినప్పటికీ ఇక్కడ మాత్రం గులాబీ వైపే మొగ్గు చూపారు. పదేళ్లలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చేయగా, బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మికే మద్దతుగా నిలిచారు. డిసెంబర్ 3న జరిగిన ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తూ నియోజవర్గంలో 17 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. వీరిలో అత్యధికంగా బీఆర్ఎస్ అభ్యర్థి కోవలక్ష్మికి 83,052 ఓట్లు వచ్చాయి, కాంగ్రెస్ అభ్యర్థి శ్యాంనాయక్‌కు 60,242 ఓట్లు పడ్డాయి. ఇక స్వతంత్ర అభ్యర్థి కొట్నాక విజయ్‌కుమార్ 16,469 ఓట్లు సాధించారు. బీజేపీ అభ్యర్థి ఆజ్మీరా ఆత్మారాం నాయక్ 6,613,బీఎస్పీ అభ్యర్థి ప్రభాకర్ 3544, ప్రజాపాలన పార్టీ ఆజ్మీరా రాం నాయక్ 2569, గోండ్వాన గణతంత్ర పార్టీ అభ్యర్థి ఆత్రం గోవర్ధన్ 759, జనతా కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి గోవింద్ భూక్యాకు 463, విద్యార్థి రాజయకీయ పార్టీ అభ్యర్థి నైతం తిరుపతి 408, బహుజన ముక్తి పార్టీ భూక్య పల్లవి 664, స్వతంత్ర్య అభ్యర్థులు కొట్నాక కిషణ్‌రావు 1534, పుసం సోనేరావు 847, మెస్రం నవీన్‌కుమార్ 1481, రెబ్బెన నాగరాజు 888, వసంత్ సింగ్ జాదవ్ 989, సిడాం అన్నీగా 2093, సిడాం ధర్ము 587 ఓట్లు సాధించారు. 1516 ఓట్లు నోటాకు పడగా, 59 ఓట్లు రిజెక్టు అయ్యాయి.



### కోవ లక్ష్మిని ఓడించాలనుకున్న కుట్రను తిప్పికొట్టిన ఓటర్లు

నియోజవర్గంలో బలమైన అభ్యర్థిగా పేరు తెచ్చుకున్న కోవలక్ష్మిని ఓడించేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్రల చేసింది. కానీ.. ప్రజల్లో ఆమెకు ఉన్న ఆదరణముందు అవ్వేవీ పని చేయలేదు. బీఆర్ఎస్‌ను ఓడించేందుకు ఆదివాసీ తెగలకు చెందిన పలువురిని బరిలో దింపి వారికి ఆర్థికంగా అండగా నిలిచినట్లు సమాచారం. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్,బీజేపీ,కాంగ్రెస్ పార్టీల నుంచి కాకుండా చిన్న చిన్న పార్టీల నుంచి సైతం బీ–ఫాంలు తీసుకువచ్చి బరిలో ఉంచారు. ఆదివాసీ ఓట్లను కొల్లగొట్టి కోవలక్ష్మిని ఓటమి పాలు చేయాలని ప్లాన్ చేసినప్పటికీ వారి పాచిక పనిచేయలేదు. ఆదివాసీ తెగలకు చెందిన 10 మంది అభ్యర్థులు స్వతంత్రులుగా వేలాది ఓట్లు ఓట్లు చీల్చారు.

# నోటాను నొక్కేశారు..



## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 17,327 ఓట్లు

## అత్యధికంగా బోథ్ 2,565.. అత్యల్పంగా ఆదిలాబాద్ 592

మంచిర్యాల, డిసెంబర్ 4(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నోటాకు 17,327 ఓట్లు పడ్డాయి. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు చాలా విలువైంది. వజ్రాయుధం లాంటి ఓటును తప్పకుండా వినియోగించుకోవాలి. సరైన పాలకులను ఎన్నుకోవాలి. అది వంద శాతం పక్కాగా జరగలేని పక్షంలో ప్రజాస్వామ్య వ్యవస్థకు అర్థం లేకుండా పోతుంది. అయితే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నచ్చనప్పుడు ఎవరో ఒకరికి ఓటు వేయడం, ఎవరూ నచ్చలేదని ఓటు వేయడానికి వెళ్లకుండా ఉండిపోవడానికి శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో తీసుకువచ్చిందే ఈ నోటా(నన్ ఆఫ్ ది ఎబో) ఆప్షన్. ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులు ఎవరూ నచ్చనప్పుడు నోటా ఆప్షన్‌కు ఓటేయెచ్చు. తద్వారా ఓటరు తమ అసమ్మతిని తెలపడంతోపాటు ఓటు హక్కును వినియోగించుకున్న వారవుతారు. కొన్ని సందర్భాల్లో ఇవ్వే గెలుపు ఓటములను డిసైడ్ చేస్తాయి కూడా. ఈ ఎన్నికల్లో అలా నోటాకు అనే ఆప్షన్‌ను ఎంచుకొని ఓటేసినోళ్లు వేలాది మంది ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా బోథ్ నియోజకవర్గంలో 2,565 మంది ఈ ఆప్షన్‌ను ఎంచుకున్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో 2,196 మంది, బెల్లంపల్లిలో 2,179 మంది, ఖానాపూర్‌లో 2,114 మంది నోటాకు ఓటేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది నియోజకవర్గాల్లో 17,035 మంది నోటాకు ఓటేస్తే 2018లో 20,254 మంది ఈ ఆప్షన్‌కు ఎంచుకున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి నోటా చాయిస్ తీసుకున్నవారి సంఖ్య తగ్గింది. పది నియోజకవర్గాల్లో మొత్తంగా 17,327 మంది నోటాను ఎంచుకున్నారు. నియోజకవర్గాలవారీగా నోటాకు ఓటు వేసిన వారి వివరాలిలా ఉన్నాయి.

| నియోజకవర్గం | నోటా ఓట్లు |
| --- | --- |
| బోథ్ | 2,565 |
| సిర్పూర్ | 2,196 |
| బెల్లంపల్లి | 2,179 |
| ఖానాపూర్ | 2,114 |
| ముథోల్ | 1,906 |
| చెన్నూర్ | 1,792 |
| నిర్మల్ | 1,526 |
| ఆసిఫాబాద్ | 1,515 |
| మంచిర్యాల | 942 |
| ఆదిలాబాద్ | 592 |
| మొత్తం | 17,327 |

# రుణపడి ఉంటా..

## – బోథ్ ఎమ్మెల్యే అనిల్ కుమార్ జాదవ్

నేరడిగొండ, డిసెంబర్ 4 : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించిన బోథ్ నియోజకవర్గ ప్రజలందరికీ రుణపడి ఉంటానని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. సోమవారం విలేకరులను కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా విజయం కట్టబెట్టిన ప్రజలకు శిరసువంచి అభివాదం చేస్తున్నానని అన్నారు. విజయం కోసం కృషి చేసిన గులాబీ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గాలి వీచిన బోథ్ నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్ పార్టీని గెలిపించడం వారి ప్రత్యేకతకు నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన సంక్షేమం, బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిని ప్రజలు విశ్వసించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ, బీజేపీ పార్టీలు చేసిన అసత్య ప్రచారాలను ప్రజలు చెంపపెట్టుగా విజ్ఞతతో తీర్పు చెప్పారని అన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించడానికి తప్పకుండా కృషి చేస్తానని అన్నారు. ప్రజలకు చెప్పిన ప్రతి మాటకు కట్టుబడి హామీలను ప్రజలలోనే ఉంటూ నెరవేరుస్తానని భరోసా ఇచ్చారు. బోథ్ నియోజకవర్గ ప్రజలు అన్ని గమనించి అందించిన గొప్ప విజయాన్ని బీఆర్ఎస్‌కు అందించారని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న అనిల్ కుమార్ జాదవ్



# ప్రగతికి పట్టం



బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## బోథ్‌లో నాలుగు సార్లు బీఆర్ఎస్‌దే విజయం

### వరుసగా మూడోసారి.. అనిల్‌ను ఆదరించిన జనం..

### బీజేపీ ఎంపీ సోయం బాపురావ్ ఘోర పరాజయం

ఆదిలాబాద్, డిసెంబర్ 4(నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఆదిలాబాద్ జిల్లాలో మిశ్రమ ఫలితాలు వెలువడ్డాయి. బోథ్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఘన విజయం సాధించగా.. ఆదిలాబాద్‌లో బీజేపీ గెలుపొందింది. బోథ్ నియోజకవర్గ ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన బోథ్ నియోజకవర్గం గణనీయమైన అభివృద్ధి సాధించింది. విద్య, వైద్యం, వ్యవసాయ, రవాణా, ఇతర సౌకర్యాలు మెరుగుపడ్డాయి. ఇంటింటా సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఎన్నికల ప్రచారంలో నాయకులు, నియోజకవర్గ అభివృద్ధితోపాటు ప్రభుత్వం పథకాలను వివరించడంతో ప్రజలు బీఆర్ఎస్‌కు అండగా నిలిచారు. 2014లో నియోజకవర్గంలో మొదటిసారి బీఆర్ఎస్ విజయం సాధించగా.. 2014, 2018, 2023లో వరుసగా మూడోసారి గులాబీ పార్టీ జెండా ఎగిరింది. నవంబర్ 30న జరిగిన పోలింగ్‌లో బోథ్ నియోజకవర్గంలో 1,72, 397 ఓట్లు పోలవగా.. 82.93 పోలింగ్ శాతం నమోదైంది. ఆదిలాబాద్ జరిగిన కౌంటింగ్‌లో 22 రౌండ్ల ఓట్ల లెక్కింపు జరుగగా.. ప్రతి రౌండ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ అధిక్యం కనపర్చారు. బీఆర్ఎస్‌కు 76,297 ఓట్లు రాగా, బీజేపీకి 53,274 ఓట్లు, కాంగ్రెస్‌కు 32,426 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ 23,023 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

### పక్కా వ్యూహంతో విజయం

ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా అనిల్‌జాదవ్‌ను ప్రకటించారు. ప్రకటన వెలువడిన మరుసటి రోజు నుంచే పార్టీ నాయకులు పక్కా వ్యూహంతో ప్రచారం కొనసాగించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, నియోజకవర్గం ఇన్‌చార్జి మాజీ ఎంపీ నగేశ్, అభ్యర్థి అనిల్ జాదవ్‌ల సమన్వయంతో ప్రచారం కొనసాగింది. తొమ్మిది మండలాల్లో ర్యాలీలు, కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. మండల, గ్రామస్థాయి నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ ప్రభుత్వం పథకాలను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. అభ్యర్థి అనిల్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ తనను గెలిపించాలని కోరారు. ఇచ్చోడలో నిర్వహించిన బహిరంగ సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరు కాగా వేల సంఖ్యలో జనం తరలివచ్చారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల కంటే ప్రచారంలో మొదటి నుంచి ముందంజలో ఉన్న బీఆర్ఎస్ శ్రేణులు చివరి వరకు అదే తీరును కనపర్చారు.

### గత ఎన్నికల కంటే ఎక్కువ మెజార్టీ

ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ బీజేపీ అభ్యర్థి ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావ్‌పై 23,023 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటి చేసిన రాథోడ్ బాపురావ్‌కు 61,125 ఓట్లు రాగా కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన సోయం బాపురావ్‌కు 54,639 ఓట్లు రాగా, రాథోడ్ బాపురావ్‌కు 6,486 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఈ ఎన్నికల్లో అనిల్‌జాదవ్‌కు 76,297 ఓట్లు రాగా సోయం బాపురావ్‌కు 53,274 ఓట్లు వచ్చాయి. గతంలో కంటే ఈ ఎన్నికల్లో 15,172 ఓట్ల ఎక్కువగా వచ్చాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన సోయం బాపురావ్‌కు ఈ ఎన్నికల్లో గతంలో కంటే 1,365 ఓట్లు తక్కువగా వచ్చాయి. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 44.2 శాతం, బీజేపీకీ 30.9 శాతం, కాంగ్రెస్‌కు 18.8 శాతం ఓట్లు లభించాయి. బీజేపీ కంటే 14 శాతం ఓట్లు అధికంగా బీఆర్ఎస్‌కు వచ్చాయి.

# అభివృద్ధికి కృషి చేస్తా..

## కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెట్టే హామీలిచ్చి గద్దెనెక్కింది..

- ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు పోరాడుతాం..
- ప్రజలు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయను..
- నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్, డిసెంబర్ 4(నమస్తే తెలంగాణ) : రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్మల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం నిర్మల్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాబోయే రోజుల్లో బీజేపీ ప్రజా గొంతుకై అసెంబ్లీలో ప్రజల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకున్నా, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించిన తాము ఏ పోరాటానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఈసారి ఎనిమిది మందిమి గెలిచామని, రాబోయే రోజుల్లో అది 80 మంది గెలిచేందుకు సంకేతమన్నారు. ఆమోదయోగ్యం కాని హామీలిచ్చి గద్దెనెక్కబోతున్న కాంగ్రెస్ పార్టీని ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు వదిలి పెట్టమన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేర్చాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ప్రతిక్షణం ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతానన్నారు.

### ఉమ్మడి ఆదిలాబాద్‌లో బీజేపీకి ఆదరణ..

రాష్ట్రంలో వీచిన ప్రభుత్వ వ్యతిరేక పవనాల్లో ఓట్లన్నీ ఒకవైపు వెళ్తున్నా కూడా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మాత్రం నాలుగు స్థానాల్లో బీజేపీని గెలిపించి ప్రధాని నరేంద్ర మోడీకి బహుమానంగా ఇస్తున్నామని మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీ పథకాలను ఆదిలాబాద్ జిల్లావాసులు నమ్మలేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి అహర్నిశలు పాటు పడుతానన్నారు. నన్ను నమ్ముకొని పదేండ్లుగా నా వెంట నడిచి, నా కష్ట సుఖాల్లోపాలు పంచుకున్న నా తోటి నాయకులు, కార్యకర్తలకు, శ్రేయోభిలాషులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు అంజుకుమార్‌రెడ్డి, పార్లమెంటు ఇన్‌చార్జి అయ్యన్నగారి భూమయ్య, లక్ష్మణచాంద ఎంపీపీ పద్మ రమేశ్, నాయకులు అయిండ్ల భూపాల్‌రెడ్డి, సరికెల గంగన్న తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి